ప్రజాశక్తి
గురువారం 20 ఏప్రిల్ 2023
5
అనంతపురం

'పది' మూల్యాంకనం మొదలు

అనంతపురం సిటీ : అనంతపురం నగరంలోని కెఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి మూల్యాంకనం బుధవారం నుంచి ప్రారంభం అయ్యింది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన పదవ తరగతి జవాబు పత్రాలను ఉపాధ్యాయులు దిద్దారు. మూల్యాంకనం కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం పరిశీలించారు. ఈ సందరద్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదవ తరగతి జవాబు పత్రాలు రెండు లక్షలు అనంతపురం జిల్లాకు వచ్చాయన్నారు. వాటిని మూల్యాంకనం చేయడం కోసం 258 చీఫ్ ఎగ్జామినర్స్, 950 మంది అసిస్టెంట్ చీఫ్ ఎగ్జామినర్స్, 250 మంది స్పెషల్ అసిస్టెంట్స్‌ను నియమించినట్లు తెలిపారు. ఈనెల 26వ తేదీ వరకు జవాబు పత్రాల మూల్యాంకన కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. విధులకు హాజరు అయిన సిబ్బందికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, ఫ్యాన్స్, వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేడు ఆర్జేడీ ప్రతాప్ రెడ్డి రాక

ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్, కడప ఆర్జేడీ, పదో తరగతి పరీక్షల జిల్లా అబ్జర్వర్ బి.ప్రతాప్ రెడ్డి గురువారం అనంతపురానికి రానున్నారు. జిల్లా కేంద్రంలో జరుగుతున్న పది మూల్యాంకనాన్ని పరిశీలించనున్నారు.

మరో విద్యుత్ ప్రాజెక్టు

- ఏర్పాటుకు ఎన్టీపీసీ శ్రీకారం
- మూడు వేల మెగావాట్ల హైబ్రిడ్ విద్యుత్ ఉత్పాదన
- కంబదూరు, తలుపుల్లో దాదాపు 30 వేల ఎకరాలు. ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లా ఇప్పుడు పెద్ద విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారుతోంది. ఇప్పటికే సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి గణనీయంగా ఉంది. రాబోయే రోజుల్లో మరింతగా విస్తరించే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే అదానీ సంస్థ సోలార్, పంప్డ స్టోరేజీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా కేంద్ర ప్రభుత్వ రంగం సంస్థ అయిన ఎన్టీపీసీ కూడా ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు చోట్ల మూడు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నట్లు సమాచారం. అనంతపురం జిల్లాలోని కంబదూరు, రామగిరి ప్రాంతాల్లోనూ, అటు సత్యసాయి జిల్లాలో తలుపుల, ఎన్పీకుంట ప్రాంతాల్లోనూ హైబ్రిడ్ సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపడుతోంది.

గ్రీన్ హైడ్రోజన్ కోసం ?

కప్టీవ్ పవర్ ప్రాజెక్టు

కాలుష్య నియంత్రణలో భాగంగా ఇప్పుడు డీజల్, బొగ్గు ఇతర వాడటాన్ని తగ్గించి ప్రత్యామ్నయ ఇంధన వనరులను ఉత్పత్తి చేయాలని అంతర్జాతీయంగా ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రీన్ హైడ్రోజన్ వాడకం కోసం హైడ్రోజన్ ఇంధన ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు దేశ వ్యాప్తంగా కసరత్తు సాగుతోంది. ఇందులో భాగంగా విశాఖపట్నంలో హైడ్రోజన్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఎన్టీపీసీ ముందుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఒప్పందం సైతం ఈ సంస్థ చేసుకుంది. దీనికి అవసరమైన విద్యుత్‌ను అందించేందుకు ఇక్కడ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే కంబదూరు, తలుపుల ప్రాంతాల్లో మూడు వేల మెగావాట్ల హైబ్రిడ్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చినట్లు సమాచారం.

దాదాపు 30 వేల ఎకరాలు ?

ఈ రెండు ప్రాంతాల్లో ఎక్కడ సోలార్, విండ్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయడాని వీలుందన్న అధ్యయనాలతోపాటు, స్థల నిర్ధారణలను ఎన్ఆర్ఇడి సంస్థ చేపట్టింది. దీని ప్రకారం చూస్తే కంబదూరు ప్రాంతంలో కురాకులపల్లి, చెన్నంపల్లి, రాళ్లపల్లి, రాళ్ల అనంతపురం, పల్లూరు, రామాపురం గ్రామాల పరిధిలో 12 వేల ఎకరాల భూమి అనుకూలంగానున్నట్టు గుర్తించారు. ఇదే తరహాలో తలుపుల, ఎన్పీకుంట, కొంత భాగం కడప జిల్లాలో కలిపి తలుపుల, వెలిచెలిమెల, వేపమానిపేట, పెద్దన్నవారిపల్లి, పులిగుండ్ల, గౌకన్నపల్లి గ్రామాల పరిధిలో సుమారు 20 వేల ఎకరాల భూమి ఉన్నట్టు గుర్తించారు. మొత్తం కలిపి 30 వేల ఎకరాల వరకు భూ సేకరణ అవసరమయ్యే సూచనలున్నట్టు తెలుస్తోంది. భూసేకరణకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం భూముల కేటాయింపులపై ఒక విధానాన్ని తీసుకొచ్చింది. ఏడాదికి ఎకరానికి రూ.30 వేలు లీజు చెల్లించే విధంగా నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు ఏ పద్ధతుల్లో భూసేకరణ అన్నది చూడాల్సి ఉంది. గతంలో ఎన్పికుంటలో ఈ సంస్థ ఏర్పాటు చేసి ఉంది.

సామాన్యుడిపై ధరాభారం..!

- పెరిగిన ధరలతో జనం బెంబేలు
- గుదిబండగా గ్యాస్‌బండ
- సలసలా కాగుతున్న వంట నూనెలు
- పెనుభారంగా పెట్రో, విద్యుత్ ఛార్జీలు

ప్రజాశక్తి-హిందూపురం

పేదలు, దిగువ మధ్యతరగతి కుటుంబాల ఇంటి బడ్జెట్ తలకిందులైంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే నిత్యావసరాల కోసం నెలవారీ బడ్జెట్ రూ.15వేల నుంచి రూ.18వేలకు చేరింది. గతేడాదితో పోలిస్తేతే ధరలు పెరగటమే తాజా పరిస్థితికి కారణం. అయితే ఆ స్థాయిలో ఆదాయాలు లేకపోవడంతో ప్రతి ఒక్కరిలోనూ ఆందోళన నెలకొంది. ప్రస్తుతం మార్కెట్లలో పెరుగుతున్న నిత్యావసర సరుకులు, పెట్రో, గ్యాస్ ధరలు సామాన్యుల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రెండు నెలల కాలంలో పలు నిత్యావసర వస్తువుల ధరలతో పాటు పెట్రోలు, డీజిల్, గ్యాస్, వంట నూనెలు, విద్యుత్ ఛార్జీలు సామాన్యులపై దండెత్తుతున్నాయి. పెరుగుతున్న ధరల దాడికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా నూనెల ధరలు ఆకాశనంటుతున్నాయి. కిలో సన్‌ఫ్లవర్ నూనె రూ.145 నుంచి రూ. 150 ఉన్న ధర ప్రస్తుతం రూ. 195 నుంచి రూ. 200 వరకు చేరింది. పామాయిల్ ధర రూ. 120 ఉండగా ప్రస్తుతం రూ.160 వరకు పలుకుతోంది. వేరుశనగ నూనె ధర రూ.180 నుంచి రూ. 230 వరకు చేరింది. ఇలా పలు నూనెల ధరలు పెరుగుతున్నాయి. ఇదే అదనుగా భావించిన పలువురు వ్యాపారులు నో స్టాక్ పేరిట అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పెట్రోలు, డీజిల్ ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. లీటరు పెట్రోలు రూ.115.30 పైసలుండగా, డీజిల్ రూ.101 కి చేరింది. కేంద్ర, రాష్ట్ర పన్నుల మోతతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇంధనం ధరల పెంపు అన్ని రంగాలపై పడుతోంది. రవాణా ఛార్జీలు పెరగడంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలపై భారాలు తప్పడం లేదు.

అదేబాటలో నిత్యావసరాలు

కూరగాయలు, నిత్యావసర ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. గత నెలలో పచ్చిమిర్చి కిలో రూ.30 ఉండగా, ప్రస్తుతం రూ.45కు చేరింది. కిలో కంది పప్పు రూ.110 నుంచి రూ.130 వరకు, మినుములు రూ.100 నుంచి రూ.140, పెసరపప్పు రూ.100 నుంచి రూ.120, చక్కెర రూ.35 నుంచి రూ.45 వరకు, గోదుమలు రూ. 50 నుంచి రూ. 65 వరకు పెరిగాయి. మరో వైపు గ్యాస్ ధరలు నెలవారీగా పెంచుతుండడంతో రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలకు మళ్లీ కట్టెల పొయ్యే దిక్కయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతేడాది 14 కిలోల సిలిండర్ ధర రూ.930 నుంచి దశల వారీగా పెరుగుతూ తాజాగా రూ.1210కి చేరింది. గ్యాస్ ధర పెంపుతో నెలకు జిల్లా ప్రజలపై రూ.అరకోటి మేరకు అదనపు భారం పడుతోంది. తాజాగా విద్యుత్ ఛార్జీలు సైతం సర్‌ఛార్జీల పేరుతో మోత మోగుతున్నాయి. యూనిట్ ధర పెరగడంతో ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి విద్యుత్ బిల్లులు భారం అదనంగా మారింది. గృహావసరాల విద్యుత్ ఛార్జీ రూ.0.40 పైసలు నుంచి రూ. 0.50 పైసల వరకు పెరిగింది.

పెరిగిన ఇంటి బడ్జెట్

మా ఇంట్లో నలుగురు కుటుంబ సభ్యులు ఉంటున్నాం. పెరిగిన ధరలతో నిత్యావసర సరుకుల కొనుగోలుకు కనీసంగా రూ.8వేలు వెచ్చించక తప్పడం లేదు. టూ వీలర్, పెట్రోల్ బిల్లు నెలకు రూ.3వేల చేరింది. విద్యుత్, పాల బిల్లు కలిపి మరో రూ.3వేలు అవుతోంది. ఇంటి పన్నులు పెరగటంతో ఇంటి అద్దె పెంచేశారు. గతంలో రూ.4,500 ఇప్పుడు రూ.5వేలు చెలించాల్సి వస్తుంది. తీసుకునే వేతనం చాలక అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఆరోగ్య అవసరాలకు చేతిలో చిల్లిగవ్వ ఉండట్లేదు.

భాస్కర్, హిందూపురం.

ధరలను నియంత్రించాలి

పాలక ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామనే ప్రచారం విస్తతంగా చేస్తున్నాయి. మరో వైపు పన్నులు రూపంలో వసూలు చేస్తున్నాయి. ప్రతి కుటుంబంలో భార్యభర్తలు ఇద్దరూ కష్టపడినా కుటుంబ ఖర్చుల కోసం ఇబ్బందులు తప్పటం లేదు. పాలక ప్రభుత్వాలు చొరవ చూపాలి. ధరల నియంత్రణపై దష్టి పెట్టాలి.

మల్లికా బాను, గృహిణి, సిపిఐ కాలనీ, హిందూపురం.

విధులను నిర్లక్ష్యం చేయొద్దు

కలెక్టర్ ఎం.గౌతమి

ఆకుతోటపల్లి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సచివాలయ ఉద్యోగులు వారి విధులను నిర్లక్ష్యం చేయకుండా, సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. బుధవారం అనంతపురం రూరల్ మండలం, ఆకుతోట పల్లి గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం ఉద్యోగులు నిర్వహిస్తున్న విధులను గురించి అడిగి తెలుసుకున్నారు. విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. అక్కడి రిజిస్టర్లను పరిశీలించారు. స్పందన కార్యక్రమంలో స్వీకరించే అర్జీలను ఎప్పటికప్పుడు సకాలంలో పరిష్కరించాలని అదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిన దష్ట్యా డాక్టర్ పేరు, ఫోన్ నెంబరు విధిగా ప్రతి గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించేలా చూడాలన్నారు. ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉపాధి హామీ కూలీలకు గ్రామ సమీపంలో పనులు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా తాము చేసిన పనులకు ఇంకా బిల్లులు రాలేదని ఉపాధి హామీ కూలీలు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ మధుసూదన్, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపిడిఒ బాబా ఫకృద్దీన్, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, సర్పంచి గురుప్రసాద్ పాల్గొన్నారు.

రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఎం.గౌతమి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిహెచ్‌సిని తనిఖీ చేస్తూ అక్కడ విభాగాలన్నింటినీ పరిశీలించారు. పిహెచ్‌సి భవనాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులను సూచించారు. ప్రసవాలు ఇక్కడే చేపడుతున్నారా.? అని అక్కడ డాక్టర్‌ను ప్రశ్నించగా సాధారణ ప్రసవాలను ఇక్కడ చేస్తున్నామని ఏదైనా క్రిటికల్ కేసులు ఉంటే వాటిని జిల్లా ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న గర్భిణులతో కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది మీ ఇంటికి వస్తున్నారా.? అని అడగగా ఆమె వస్తున్నారని సమాధానం ఇచ్చారు. ఆరోగ్యపరంగా ఏమైనా ఇబ్బందులు ఉంటే ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్ ఫోన్ నెంబర్ తీసుకుని మాట్లాడాలని ఆమెకు సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్‌డిఒ మధుసూదన్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ లక్ష్మీ నరసింహా, ఎంపీడీవో సాల్మన్, డాక్టర్ శ్రావణి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ కార్యాలయాల తనిఖీ

కలెక్టరేట్‌లోని ఖజానా శాఖ, కమాండ్ కంట్రోల్ రూమ్, రెవెన్యూ శాఖ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ అన్ని శాఖలు డిజిటలైజేషన్ దిశగా సాగాలన్నారు. పాత రికార్డులను డిజిటల్‌గా భద్ర పరిచే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. కలెక్టరేట్ ఆవరణం మరింత శుభ్రంగా కనిపించేందుకు సూచనలు చేశారు. ఎక్కడికక్కడ స్వచ్ఛ సంకల్పం చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. వాహన పార్కింగ్ క్రమ బద్ధంగా ఉండేలా చూడాలన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతా ప్రమాణాల విషయంలో రాజీ ఉండకూడదన్నారు. కలెక్టరేట్ కార్యాలయాల నిర్వహణ మారుతున్న కాలానికి తగ్గట్టు ఉండాలని, కలెక్టరేట్ అవరణంలో పరిశుభ్ర వాతావరణం ప్రభవించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ గాయత్రీ దేవి, ఏఓ విజయలక్ష్మి, జిల్లా ఖజానా అధికారి సరళ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మితిమీరిన సైబర్ నేరగాళ్ల ఆగడాలు

ఉపాధ్యాయిని ఖాతా నుంచి రూ.30 వేలు మాయం

ప్రజాశక్తి-గుత్తి

మండలంలో ఇటీవల సైబర్ నేరగాళ్ల ఆగడాలు మితిమీరిపోయాయి. నిరక్షరాస్యులు, అక్షరాస్యులు, ఉద్యోగులు నిరుద్యోగులు అనే తేడా లేకుండా అందరినీ సైబర్ నేరగాళ్ల లక్ష్యంగా చేసుకుని మోసం చేస్తున్నారు. మంగళవారం నాడు జెండా వీధికి చెందిన మహమ్మద్ సిరాజుద్దీన్ అనే యువకుడి బ్యాంకు ఖాతా నుంచి రూ. 4,600ను స్వాహా చేసిన విషయం పాఠకులకు విధితమే. ఇది మరువకనే బుధవారం నాడు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి



ఓ ఉపాధ్యాయుడు మోసం పోయాడు. గ్రహించిన ఉపాధ్యాయుడు పోలీసులను ఆశ్రయించాడు. పట్టణానికి చెందిన సుశీల పద్మావతి అబ్బేదొడ్డి గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె తన ఎస్‌బిఐ బ్యాంకు ఖాతాను పరిశీలించగా రూ.30 వేలు మాయమయ్యింది. ఈనెల 15వ తేదీన రూ.10 వేలు, 16వ తేదీన రూ.10 వేలు, 18 తేదీన రూ.10 వేలును సైబర్ నేరగాళ్ల స్వాహా చేశారు. దీంతో ఆమె స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్‌ను సంప్రదించారు. ఇది సైబర్ నేరగాళ్ల పని అయ్యిఉంటుందని ఆయన తెలిపారు. ఈ మేరకు బాధిత ఉపాధ్యాయురాలు సఐ ఎం.వెంకటరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు.

పివికెకెలో ప్రాంగణ నియామకాలు

అనంతపురం : అనంతపురం రుద్రంపేట, పివికెకె ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నాడు జేసీబీ గోల్డ్ ఫీల్డ్ ప్రైIIలిII ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలను నిర్వహించారు. ఈ సంధర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వైభవ్ మాట్లాడుతూ ప్రాంగణ నియామకాలను పీవీకేకే పాలిటెక్నిక్‌లో ప్రస్తుతం డిప్లొమా చివరి సంవత్సరం చదువుతున్న మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం నిర్వహించినట్లు చెప్పారు. ప్రఖ్యాత సంస్థ జేసీబీ గోల్డ్ ఫీల్డ్ ప్రైIIలిII ద్వారా నిర్వహించామన్నారు. ప్రాంగణ నియామక అధికారి డాIIభాను కిరణ్ మాట్లాడుతూ ఇంటర్వ్యూ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన టెక్నికల్, హెచ్‌ఆర్ రౌండ్ అనంతరం 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. వీరికి ఆ సంస్థ 45 రోజుల పాటు శిక్షణ ఇచ్చి వివిధ విభాగాలలో సర్వీస్ ట్రైనీ, సర్వీస్ ఇంజినీర్లుగా నియమిస్తారని చెప్పారు. శిక్షణా సమయంలో వసతి భోజన సదుపాయాలతో పాటు నెలకు 10 వేల రూపాయలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ వైభవ్, సంస్థ ప్రతినిధులు సారథి, హెచ్‌ఆర్ మేనేజర్ విజయ భాస్కర్, జోనల్ మేనేజర్, మెకానికల్ విభాగాధిపతి జయలక్ష్మి పాల్గొన్నారు.

కృష్ణమూర్తికి గుర్రం జాషువా పురస్కారం

ప్రజాశక్తి-అనంపురం కలెక్టరేట్

అనంతపురం నగరానికి చెందిన మహాబోధి సాహిత్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు దాసన్నగారి కృష్ణమూర్తి మహాకవి గుర్రం జాషువా పురస్కారానికి ఎంపిక అయ్యారు. సాహితీ కళా సాంస్కృతిక రంగాల్లో విశేష సేవలందిస్తున్న వారికి తెనాలికి చెందిన పద్మభూషణ్ గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ సంస్థ వారు ప్రతిఏటా గుర్రం జాషువా పురస్కారాలను అందజేస్తున్నారు. ఇందులో భాగంగా 2023 సంవత్సరానికి దాసన్న కృష్ణమూర్తికి సాహిత్య కళాభూషణ్ బిరుదుతో గుర్రం జాషువా పురస్కారం అందజేస్తున్నట్లు కమిటీ వ్యవస్థాపకులు డాక్టర్ పెద్దేటి యోహాను ప్రకటించారు. కృష్ణమూర్తికి జాషువా పురస్కారం ప్రకటించిన సందర్భంగా ప్రముఖ సాహితీవేత్తలు, రచయితలు ఆచార్య బాలసుబ్రమణ్యం, ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ పతికి రమేష్ నారాయణ, డాక్టర్ శాంతినారాయణ, బండి నారాయణస్వామి, డాక్టర్ గేయానంద్, బిక్కి కృష్ణ, డాక్టర్ తూముచర్ల రాజారాం, నాగలింగయ్య సాకే శ్రీహరి, తోట నాగరాజు, గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.

విద్యుత్ బకాయిలు చెల్లించండి : ఏఈ

బొమ్మనహల్ : మండలంలోని 30 గ్రామాల్లో దాదాపు రూ.60 లక్షల వరకు విద్యుత్ బిల్లులు బకాయిలో ఉన్నాయని, వీటిని రైతులు, గృహ వినియోగదారుల చెల్లించి విద్యుత్ శాఖకు సహకరించాలని అసిస్టెంట్ ఇంజినీర్ లక్ష్మారెడ్డి కోరారు. బకాయి వసూళ్ల నిమిత్తం బుధవారం నాడు మండల పరిధిలోని దర్గాహొన్నూరు, గోవిందవాడ, గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గహాలకు సంబంధించి రూ.18 లక్షలు, వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించి రూ.25 లక్షలు, వ్యాపార సంస్థలకు రూ.60 లక్షల దాకా బకాయిలు ఉన్నాయన్నారు. బకాయిలను వీరు సకాలంలో చెల్లిస్తే మరికొంతమంది రైతులకు వ్యవసాయ సర్వీసులు, నూతన గహాలకు కొత్త సర్వీసులు అందించే వీలుంటుందన్నారు.

మిరపపంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మిరప రైతులు గిట్టుబాటు ధర లేక తీవ్ర కష్టాల్లో ఉన్నారని, ఈ పంటను ప్రభుత్వం కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 20 వేల ఎకరాల్లో సాగు చేసిన మిరప పంట ధర వారం రోజుల్లోనే క్వింటాకు రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పడిపోయిందన్నారు. దళారులు ఇష్టానుసారంగా ధరను తగ్గించి రైతులను దోచుకుంటున్నారని తెలిపారు. వీటిని నివారించి రైతులను ఆదుకునేందుకు ప్రభుతం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బొమ్మనహాల్, విడపనలకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో మిర్చి ఎక్కుగా సాగు అవుతోందన్నారు. ఈ పంట సాగు చేస్తున్న రైతుల్లో సగం మందికి పైగా కౌలు రైతులు ఉంటున్నారని తెలిపారు. ఎకరాకు రూ.40 నుంచి రూ.75 వేల వరకు ముందస్తు కౌలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మిర్చి ఎకరా సాగుకు కనీసం రూ.లక్ష పెట్టుబడి ఖర్చు వస్తుందన్నారు. దళారులు, ఫర్టిలైజర్ షాపు యజమానుల వద్ద అధిక వడ్డీలతో అప్పులు తీసుకుని రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. గత నెల బ్యాడిగి మిరప క్వింటా ధర రూ.27 వేలు ఉండగా ప్రసుతం వ్యాపారులు రూ.17 వేలకు మించి అడగటం లేదన్నారు. ప్రతి సంవత్సరం పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయని, పంట రైతు చేతికి వచ్చిన సమయంలో ధర ఘోరంగా తగ్గిపోతోందన్నారు. ఈ సమస్య నుంచి రైతులను కాపాడేందుకు శాశ్వత చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణం ప్రభుత్వం కొనుగోలు చేసి మిరప క్వింటా కనీసం రూ.27 వేలతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆత్మకూరులో కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి - ఆత్మకూరు

స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో బెంగళూరులోని శంకర నేత్రాలయ వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు చేసి వివిధ గ్రామాలకు చెందిన 53 మందిని ఎంపిక చేశారు. వీరికి బెంగళూరులో ఉచితంగా శస్త్రచికిత్స చేస్తామని తెలిపారు. మండల ప్రజలు కంటి చూపు సమస్యతో బాధపడకూడదని ఎమ్మెల్యే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయించారని సర్పంచ్ వరలక్ష్మి, డా. దయాకర్ తెలిపారు. శంకర్ నేత్రాలయ సిబ్బంది, ఎంపీహెచ్‌ఈఓ నాగేశ్వరయ్య, సీహెచ్‌ఓ చంద్రావతి, స్థానిక నాయకులు, వన్నూరప్ప, డీలర్ రాజశేఖర్, టైలర్ వెంకటేష్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి-ఉరవకొండ

స్థానిక ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో ఆరో రోజూ అగ్నిమాపక వారోత్సవాలు కొనసాగాయి. ఇందులో భాగంగా వైద్యాధికారులు, నర్సులు,సెక్యూరిటీ సిబ్బంది, ఆస్పత్రికి వచ్చిన ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోగులను బయటికి తీసుకెళ్లే అంశాలపై సూచనలు సలహాలు ఇచ్చారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు లిఫ్టులు వాడకూడదని వివరించారు. ఫైర్ స్టేషన్ అధికారి లింగమయ్య, సిబ్బంది, వైద్యాధికారులు, సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

దేవగిరిలో తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న ఆర్ డబ్ల్యుఎస్ అధికారులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

నీటి ట్యాంక్ పరిశీలన

ప్రజాశక్తి-బొమ్మనహళ్

బొమ్మనహాళ్ మండల పరిధిలోని దేవగిరి గ్రామంలో తాగునీటి సమస్యపై ప్రజాశక్తిలో ప్రచురితమైన వార్తకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించారు. బుధవారం నీటి ట్యాంకును పరిశీలించి మరమ్మతులు చేశారు. గ్రామంలోని చివరి కుటుంబాలకు తాగునీరు అందిస్తామని ఈఈ.వేణుగోపాల్ విజయం తెలిపారు. గ్రామానికి తాగునీరు అందించడానికి, వేసవిలో నీటి ఎద్దడి నివారణకు శక్తి వంచన లేకుండా కషి చేస్తామని ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు తెలిపారు.

రైతు రుణాలు మాఫీ చేయండి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

రైతుల రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలని యూనియన్ బ్యాంక్ ఎదుట సిపిఐ సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి వెంకటరాముడు యాదవ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైతులందరికీ రుణాలు మంజూరు చేసి, కొత్త రుణాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని యూనియన్ బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు నారాయణ, ముత్యాలరెడ్డి, రంగస్వామి, నారాయణస్వామి, ఆదినారాయణ, రంగనాయకులు, వెంకటరాముడు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని కల్లుమడి గ్రామానికి చెందిన డి.వెంకట రాముడు కుమార్తె శిల్పా(16) కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఈ నెల 18వ తేదీన కల్లుమడి గ్రామంలోన తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. యువతి ఆచూకీ తెలిసినవారు శింగనమల సిఐ అస్రార్‌బాషా, ఫోన్ 9346010558, ఎస్ఐ శ్రీనివాసులు ఫోన్ 9346010580 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వృద్ధుడి మృతి

ప్రజాశక్తి-గుత్తి

అనారోగ్యానికి గురైన ఓ వృద్ధుడు తీసుకున్న మందులు మార్పు వల్ల అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించాడు. పట్టణంలోని సుందరయ్య కాలనీకి చెందిన గోపాల్ నాయుడు(62) అనే వద్ధుడు అనారోగ్యానికి గురయ్యాడు. ఓ డాక్టర్ వద్ద చికిత్స తీసుకుంటున్నాడు. డాక్టర్ రాసి ఇచ్చిన మందులు కాదని వేరే మందులు తీసుకోవడంతో మూడు రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అతన్ని వైద్యులు సూచన మేరకు అనంతపురం సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు అక్కడ చికిత్స పొందుతూ మతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రీసర్వే పనుల పరిశీలన

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండలంలోని ఆవులాంపల్లి, విరుపాపురం గ్రామాల్లో జరిగిన రీసర్వే పనులను ఆర్డీవో రవీంద్ర బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం జరిగిన పనుల్లో హద్దు రాళ్లను నాటాల్సి ఉండగా వాటిని ఆయనతోపాటు జిల్లా సర్వేయర్ నాగరాజు, తహశీల్దారు ఈరమ్మ, సర్వేయర్ ఆయేషా, ఆర్ఎస్ఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొని పర్యవేక్షించారు. సర్వేచేసిన రైతుల పొలాల్లో జగనన్న భూరక్ష హద్దురాళ్లను పాతించి పత్రాలను అందజేశారు. మండల వ్యాప్తంగా కూడా రీసర్వే పనులు త్వరలో జరుగుతాయని ఆయన తెలియజేశారు. ఇప్పటి వరకు జరిగిన గ్రామాల్లో రీసర్వే పూర్తిచేసి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందజేయడంతోపాటు హద్దురాళ్లను కూడా పాలించినట్లు చెప్పారు.

42వ డివిజన్‌లో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం నగరంలోని 42వ డివిజన్ ఎల్‌బి.నగర్, 6వ రోడ్డులో ఇదేం ఖర్మ – మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వీరి కాలనీలో ప్రతి ఇంటికీ తిరిగి వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేశారు. ప్రజలపై మోపుతున్న భారాన్ని తెలియజేసేలా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షుడు మారుతి గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, తెలుగు మహిళ నగర అధ్యక్షురాలు విజయశ్రీ, బీసీ సెల్ నాయకుడు గోపాల్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు బోయ రాము పాల్గొన్నారు.

ఇదే ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు

జగన్‌ను ఎదుర్కోలేకే.. చంద్రబాబు కుట్ర రాజకీయాలు

ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

సంక్షేమ పాలనతో ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని నేరుగా ఎదుర్కోలేకే వైఎస్ వివేకానందరెడ్డి హత్యను అడ్డుపెట్టుకుని చంద్రబాబు అండ్ కో సీఎం కుటుంబంపై వ్యక్తిగతంగా కుట్ర చేస్తున్నారని ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ తలారి రంగయ్య విమర్శించారు. బుధవారం అమిద్యాల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ముందుగా వైస్సార్సీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యేకి, ఎంపీకి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రతి గడప వెళ్లి సీఎం జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న పథకాలను విశ్వేశ్వరరెడ్డి వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. జగన్ కుటుంబంపై నిందలు వేయడానికి వివేకా హత్య కేసు విచారణలో పెద్ద కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఇందులో ఎల్లో మీడియా కూడా దిగజారుడు కథనాలు ప్రచారం చేస్తోందని, చంద్రబాబు తో కలిసి రాజకీయ కుట్రకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇదంతా చంద్రబాబు కనుసన్నల్లోనే జరుగుతోందని, కుట్రపూరితంగా తెదేపా అధినేతే వెనకుండి నాటకమాడిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకాలం ఎంత బురద జల్లుతున్నా ఓపిగ్గా ఉన్నామని ఇక సహించేది లేదన్నారు. ఈ విష ప్రచారాన్ని తిప్పి కొడతాం అన్నారు. వివేకానంద హత్యపై ఇంత దుష్ప్రచారం చేస్తున్న ఎల్లో మీడియా మార్గదర్శి, స్కిల్ స్కామ్ అక్రమాలపై నోరెందుకు మెదపడం లేదని ప్రశ్నించారు. మార్గదర్శి అక్రమాలపై సుప్రీంకోర్టు మొట్టికాయలు కనపడవా అని అడిగారు. స్కిల్ డెవలెప్మెంట్ స్కామ్ లో చంద్రబాబు, లోకేష్ వందల కోట్ల రూపాయలు దోచుకొంటే ఒక్క అక్షరమైనా ఎందుకు రాయడం లేదన్నారు. కేవలం కులగజ్జితో తమ కులపోడు ఏమి తప్పు చేసినా అది సరైందనే ధోరణిలో ఎల్లోమీడియా ఉండడం దురదష్టకరం అన్నారు. చంద్రబాబుతో సహా వీళ్లంతా రాష్ట్ర ద్రోహులని వీళ్ళని ప్రజలే తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మరోవైపు వీరి కుట్రలను, తప్పుడు రాతలను ప్రజలు పట్టించుకోవడం లేదని సీఎం జగన్‌ను దేవుడిగా పేదలు భావిస్తున్నారని చెప్పారు. గడప గడపకూ వెళ్లిన సమయంలో ఇదే విషయాన్ని ప్రజలు తమకు చెబుతున్నారన్నారు. ఎంపీపీ చంద్రమ్మ, జడ్పీటీసీ పార్వతమ్మ, ఎంపీడీఓ చంద్రమౌళీ, తహసీల్దార్ షాబుద్దీన్, వైస్ ఎంపీపీలు శ్రీనాథ్‌రెడ్డి, నరసింహులు, సర్పంచ్ శ్రీరాములు, ఉప సర్పంచి వెంకటరెడ్డి, ఆమిద్యాల పీఏసీఎస్ చైర్మన్ తేజోనాథ్, నాయకులు రాజేష్, మండల అగ్రి బోర్డు చైర్మన్ వెంకటేసులు, ఎంపీటీసీ ఓబయ్య, రామాంజనేయులు, ఓబన్న, సంగమేష్, రమేష్, మల్లప్ప, సమర, రామన్న, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

నువ్వే మా నమ్మకం జగన్న స్టిక్కర్లను అందిస్తున్న ఎంపీ తలారి రంగయ్య, విశ్వేశ్వరరెడ్డి

బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపుదాం

సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. శింగనమలలో బుధవారం సిపిఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందాం' పేరిట సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14 నుంచి 30వ తేదీ వరకూ జరిగే ప్రచార భేరి పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దుర్మార్గాలను నిలదీయాల్సిన సమయం ఆసన్నమైందని, లేకుంటే భవిష్యత్తు అంధకారం అవుతుందని హెచ్చరించారు. మోదీ, అమిత్ షా నాయకత్వంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతున్నాయని తెలిపారు. మరోవైపు అదాని, అంబానీలకు దేశ సంపద దోచిపెడుతున్నారని మండిపడ్డారు. గతంలో బ్రిటిష్ పాలకులను ఎదురించి తెచ్చుకున్న స్వాతంత్ర్యం నేడు పెను ప్రమాదంలో పడిందని, దానిని కాపాడుకోవడానికి ఆనాటి జాతీయోద్యమ స్ఫూర్తితో మళ్లీ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బ్యాంకులను, ప్రభుత్వ రంగ పరిశ్రమలు, ఓడరేవులు, అన్నం పెట్టే వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తుందని ఆరోపించారు. గ్యాస్ బండ గుదిబండ అయిందని, కరెంటు బిల్లులు అడ్డగోలుగా పెంచాలని, పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు బతుకుల్లో మంటలు రాజేస్తున్నాయన్నారు. నిరుద్యోగులు రోడ్డున పడ్డారని, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, పేదలకు విద్య, వైద్యం అందనంత ఖరీదైపోయిందన్నారు. ఉపాధి పథకాన్ని మోదీ ప్రభుత్వం ఆటకెక్కించిందన్నారు. సుంకన్న, లక్ష్మీనారాయణరెడ్డి, వెంకటస్వామి, ధనాంజనేయులు లక్ష్మీనారాయణ, ఓబిరెడ్డి, ఆంజనేయులు, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద విధానాలు అనుసరిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసి దేశాన్ని కాపాడుకుందామని సిపిఎం, సిపిఐ నాయకులు పిలుపునిచ్చారు. వజ్రకరూరులో బుధవారం సిపిఎం, సిపిఐల ఆధ్వర్యంలో ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్న బిజెపి ప్రభుత్వం దుర్మార్గాలను ఎండగట్టాలన్నారు. అదానీ, అంబానీ లాంటి బడా బాబులకు దేశ సంపదను దోచిపెడుతూ బడుగు, దేశంలో రాష్ట్రంలో అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అరికట్టడానికి ప్రజల, ప్రజాసంఘాల, కార్మిక సంఘాలను కలుపుకొని సిపిఎం, సిపిఐ పార్టీలు ముందుకొచ్చి బూర్జువా పార్టీలను భూస్థాపితం చేయడానికి ప్రచార బేరి కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. సీపీఎం మండల కన్వీనర్ విరుపాక్షి, సీపీఐ ఉరవకొండ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, వజ్రకరూరు మండల కార్యదర్శి సుల్తాన్, సహాయ కార్యదర్శి బోయ హనుమంతు, ఉరవకొండ రైతు సంఘం ఉపాధ్యక్షులు బి.నాగరాజు, మహిళా సమైక్య నాయకురాలు వన్నూరమ్మ, సిఐటియు నాయకులు ఉపేంద్ర, పంచాయతీ కార్మికులు, మహిళా సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సింగనమలలో ప్రచారభేరి కరపత్రాలను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ఆకుతోటపల్లెలో గుండె వైద్యశిబిరం

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఔషధ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ వన్ ఆధ్వర్యంలో కిమ్స్ సవేరా హాస్పిటల్ సహకారంతో ఆకుతోటపల్లి మేజన్ గ్రామపంచాయతీ సర్పంచ్ చిత్ర గురుప్రసాద్ సమన్వయంతో స్థానిక ఎంపీపీ స్కూల్‌లో బుధవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆకుతోటపల్లి ప్రజలు 200 మందికి పైగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోన్నారు. బీపీ, షుగర్, ఈసీజీ, టుడి ఎకో వంటి గుండె పరీక్షలు ఉచితంగా చేసి మందులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మాచిరెడ్డి రామకష్ణారెడ్డి, ఎస్కేయూ కాలేజ్ ఆఫ్ ఫార్మాసిటికల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సోమశేఖర్ గుండె ప్రాముఖ్యతను వివరించారు. ఆచార్య మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ నిత్యజీవితంలో పొరపాట్లను సరిదిద్దుకుంటే గుండె సంబంధిత సమస్యలను నివారించవచ్చు అన్నారు. విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.మురళీధర్ జాతీయ సేవా పథకం, వైద్య శిబిరాల గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.సత్య సౌమ్య మాట్లాడుతూ సేవా మార్గాలు అనేకం ఉన్నాయి, అందులో మానవ సేవ ఉత్తమమన్నారు. కిమ్స్ సవేరా హాస్పిటల్ కార్డియాక్ విభాగం డాక్టర్ శ్రీనివాసులు సేవలందించారు. ఔషధ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, డైరెక్టర్ ప్రొఫెసర్ జివి రమణ, విశ్వవిద్యాలయం సెంటర్ వైద్యాధికారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎస్కెయు విసి

చిరు వ్యాపారులను పలకరించిన ఎమ్మెల్యే కేశవ్

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ పట్టణంలో చిరు వ్యాపారస్తులను ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ బుధవారం నాడు పరామర్శించారు. చిరు వ్యాపారులను ఆయన స్వయంగా కలిసి వారి వ్యాపార పరిస్థితులు, జీవనోపాధిపై చర్చించారు. టిడిపి అధికారంలోకి వస్తే చిరు వ్యాపారులను అన్ని విధాల ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.

చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేశవ్

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని నరసాపురం గ్రామానికి చెందిన ఆలం కష్ణుడు, దుర్గం గ్రామానికి చెందిన మాజీ డీలర్ నడిపన్న అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ద్విసభ్య కమిటీ సభ్యులు అలం నరసానాయుడు ఆయా గ్రామాలకు వెళ్లి మతదేహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బండ్లపల్లి సర్పంచి వెంకటనారాయణమ్మ, భక్తవత్సల, రవి, చంద్రబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి తలారి కుళ్లాయప్ప, ఓబులయ్య, వెంకటేష్, యూనిట్ ఇన్‌ఛార్జి నాగభూషణ, సత్యనారాయణ, బయన్న, చిన్ననరసింహుడు, హనుమంత్, ఆదినారాయణ, నరసింహుడు, మారెప్ప, వెంకటరాముడు, డప్పు పెద్దన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు గ్లాసులు పంపిణీ

ప్రజాశక్తి - శింగనమల

మధ్యాహ్న భోజనంలో భాగంగా విద్యార్థులు రాగి జావ తాగడానికి మండలానికి 3,518 స్టీల్ గ్లాసులు వచ్చాయని మండల విద్యాశాఖాధికారి నరసింహరాజు తెలిపారు. వాటిని బుధవారం ఆయన మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు గ్లాసులు పంపిణీ చేయాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. హెచ్‌ఎంలు సుజాతమ్మ, ఆనంద్, సాయినాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకట రాముడునాయక్, ఎం.ఆర్.సి సిబ్బంది విజయశంకరరెడ్డి, రమేశ్, వినయ్, కష్ణమూర్తి, సి.ఆర్.పిలు పాల్గొన్నారు.

చలివేంద్రం అనంతరం నీటిని తాగుతున్న అల్ట్రాటెక్ సిబ్బంది

అల్ట్రాటెక్ సిమెంట్ ఆధ్వర్యంలో చలివేంద్రం

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

వేసవిని దష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తి తీర్చేందుకు అల్ట్రాటెక్ సిమెంట్స్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని బుగ్గ గ్రామం వద్ద చలివేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అల్ట్రాటెక్ యాజమాన్యం మాట్లాడుతూ బుగ్గ గ్రామ పరిధిలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నిత్యం ఏదో అవసరం మీద బుగ్గ మీదుగా ప్రయాణం చేస్తుంటారని, వేసవి వేడి అధికంగా ఉన్న నేపథ్యంలో వారి దాహార్తిని దష్టిలో తీర్చేందుకు చలివేంద్రం ప్రారంభించామని అడ్మినిస్ట్రేషన్ శ్రీఅంజన్న ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్ట్రాటెక్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రఘువీరాపై అసత్య ప్రచారాలు తగదు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డిపై అసత్య ప్రచారాలు మానుకోవాలని పీసీసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాంభూపాల్‌రెడ్డి హితవు పలికారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రఘువీరారెడ్డి 2019 ఎన్నికల తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటూ వ్యవసాయానికి పరిమితం అయ్యారని వేరే కార్యకలాపాలు చేయలేదన్నారు. 2019లో ఆయన పీసీసీ అధ్యక్షుడిగా ఉండటంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించాల్సి వచ్చిందని, దీంతో కళ్యాణదుర్గంలో ప్రచారంలో సరిగా పాల్గొన లేదన్నారు. ఆయన కుమార్తె అమృత్‌వీర్ రాజకీయాలకు కొత్తకావడం, నియోజకవర్గంపై అవగాహన లేకపోవడంతో రఘువీరారెడ్డి ఓడిపోయారన్నారు. కాగా కొందరు రఘువీరారెడ్డి ఒక్కడు కాంగ్రెస్ పార్టీ తరుపున గెలిస్తే ఏమి ఒరగబెడతాడని అప్పట్లో ప్రచారం చేశారన్నారు. ఇప్పుడు ఆయన కళ్యాణదుర్గంలో పోటీ చేస్తాడో లేదా అని ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన ఇప్పుడు కర్ణాటక ఎన్నికలపై దృష్టి సారించి గల్లీ నుంచి ఢిల్లీ వరకూ రాజకీయాలు చేస్తామనడం గమనించాలన్నారు. ఇప్పటికైనా అసత్యప్రచారాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగరాజు, తిప్పేస్వామి, మాల ఎర్రిస్వామి, ఫకృద్దీన్, రామాంజనేయులు, కృష్ణమూర్తి, ఉదీప్ సింహా, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి-అనంతపురం

ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా నాల్గవ రోజైన బుధవారం ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్–ఎస్ యూనిట్ వన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నగరూరు రసూల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటడంతో పాటు డ్రగ్ అబ్యూస్ ర్యాలీ నిర్వహించారు. దెయ్యాలకుంటపల్లి గ్రామంలో ఉదయం యోగా నిర్వహించారు. అనంతరం వెంకటాపురం హైస్కూల్ దెయ్యాలకుంటపల్లి గ్రామంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ మొక్కలు నాటారు. వాటికి గ్రామ ప్రజలు నీరు పోసి సంరక్షించాలని కోరారు. ఆజాదీకా అమత మహోత్సవంలో భాగంగా వలంటీర్లు గ్రామంలో ప్రజలకు మాదకద్రవ్యాలను వాడరాదని, వాటి వల్ల జీవితాలు నాశనం అవుతాయని, మద్యం తాగడం ఆరోగ్యానికి హానికరమని, ధూమపానం ఆరోగ్యానికి చేటు, మత్తు పదార్థాలను విడనాడండి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయండి అని, నినదిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ టీచర్లు అనురాధ, నాగరత్న, శోభారాణి, రామలక్ష్మమ్మ, గ్రామ ప్రజలు సత్యనారాయణరెడ్డి, నాగేంద్ర, వెంకటమ్మ, రాములమ్మ ఉమాదేవి యంగమ్మ, కష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి - అనంతపురం

నిత్య సురభి ఛారిటబుల్ ట్రస్టు "పుట్టినిల్లు" ఆశ్రమం ఆధ్వర్యంలో బుధవారం ఛైర్‌పర్సన్ డా. ఎస్.నిర్మలమురళి పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేయడంతో పాటు అన్నదానం చేశారు. రంజాన్ మాసం పురస్కరించుకొని స్థానిక ఆదర్శనగర్‌లోని "పుట్టినిల్లు" ఆశ్రమంలో 15 కుటుంబాలకు రూ.15 వేల విలువ చేసే 20 రకాల నిత్యవసరాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మేము అభిమానించే అల్లా పేరు మీద ముస్లిం కుటుంబాలకు సరుకులు అందించామని తెలిపారు. ప్రతి ఒక్కరూ సంపాదనలో కొంత భాగం దానం చేయాలని ప్రతి మతం బోధిస్తుందన్నారు. ప్రతి ముస్లిం రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. పేద ముస్లింలకు సహాయం చేయాలని, రంజాన్ మాసంలో సాయం చేస్తే పుణ్యం సిద్ధిస్తుందన్నారు. ట్రస్టు సభ్యులు ఓబుళపతి, లక్ష్మీనారాయణ, కీర్తన, మహేంద్ర, ఆయేషా భాను, సమీరా భాను, కరీమున్ని, అమీన పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ తనిఖీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

పట్టణంలోని హిందూపురం రోడ్డులో ఉన్న మండల స్థాయి పౌరసరఫరాల గోడౌన్‌ను ఆర్‌డీఓ నిషాంత్‌రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహించి అక్కడి నిల్వలను , రికార్డులను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. వెంట స్టాకిస్టు సుబ్రహ్మణ్యం, సీఎస్‌డీటీలు శ్యాంరాయ్, ప్రమీల పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి

సోదరభావంతో మెలగాలి

ఇఫ్తార్ విందులో కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పండుగలు ప్రజల మధ్య సోదరభావం పెంపొందించాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి ఆకాంక్షించారు. రంజాన్ సందర్భంగా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ముస్లింలకు నగరంలోని పోలీస్ కన్వెన్షన్ హాలులో ఇఫ్తార్ విందు ఏర్పాటుచేయగా కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌గా పాల్గొన్న మొట్ట మొదటి అధికారిక కార్యక్రమం సమానత్వానికి ప్రతీకగా నిలిచే ఇఫ్తార్ విందు కావడం సంతోషంగా ఉంద న్నారు. రంజాన్ సందర్భంగా నెల రోజుల పాటూ ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు కఠోర ఉపవాస దీక్ష పాటించడం గొప్ప విషయమన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన అనంతలో అదే స్ఫూర్తితో రంజాన్ వేడుకలు నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ జగన్ సర్కారు ముస్లింల పక్షపాత ప్రభుత్వమన్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పిస్తే, జగన్ సర్కారుఉర్దూను అధికార భాషగా ప్రకటించడం, సబ్ ప్లాన్ ద్వారా మైనారిటీలకు నిధులు అందించడం వంటి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, అహుడా ఛైర్మన్ మహాలక్ష్మీ శ్రీనివాస్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహితి, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ రిజ్వాన్, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ కమర్ తాజ్, మత పెద్ద హారున్ రషీద్, జిల్లా అటవీ శాఖ అధికారి సందీప్ కపాకర్, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీమ్ అహ్మద్, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఫయాజ్, ఏపీ రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌజ్ బేగ్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రఫీ, తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మిర్చిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

'మిర్చి'కి మద్దతు ధర ప్రకటించాలి

సిపిఎం, రైతు, కౌలు సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-ఉరవకొండ

మిర్చి పంటకు మద్దతు ప్రకటించి రైతులను ఆదుకోవాలని సీపీఎం, రైతు, కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని రాయంపల్లి గ్రామ రైతులు పండించిన మిర్చి పంటలను బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గంలోని 45 వేల ఎకరాల్లో మిరప పంట సాగు చేయగా ఏ ఒక్కరికీ ఆశించిన దిగుబడి రాలేదన్నారు. దీనికి తోడు గత వారంలో క్వింటాల్ మిర్చి ధర రూ.76,000 ఉండగా ప్రస్తుతం రూ.35,000కు పడిపోవడంతో నష్టపోయారని వాపోయారు. రాత్రనకా పగలనకా పండించిన పంటలకు కనీస మద్దతు ధర లేకపోవడం, రైతులు, వ్యాపారాలకు మధ్య దళారీ వ్యవస్థ ప్రభావంతో తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. రైతులు పండించిన పంటలను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని ఇచ్చిన ప్రభుత్వ హామీలు ప్రకటనలకే పరిమితమయ్యాయని మండిపడ్డారు. అధికారులు స్పందించి మిర్చితో పాటు అన్ని రకాల పంటలను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, రైతు సంఘం జిల్లా నాయకులు జ్ఞానమూర్తి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, సభ్యులు శీనప్ప, వెంకటేశులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సుస్థిర పాలన సాధ్యం

ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

సీఎం జగన్ ద్వారానే సుస్థిర పాలన సాధ్యమని విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పవతి భీమ్‌రెడ్డి పేర్కొన్నారు. విడపనకల్ మండలం గడేకల్ గ్రామంలో జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని బీసీ కాలనీలలో చేపట్టారు. ఈ సందర్భంగా గడపగడపకూ తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హత ఆధారంగా అందుతున్నాయా, జగనన్న ప్రభుత్వ పనితీరు పట్ల సుముఖంగా ఉన్నారా.. లేదా అన్న అంశాలపై ఆరా తీశారు. అవినీతి రహితంగా పాలన అందిస్తున్న జగనన్నకు ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉంటుందని వారు తెలిపారు. విడపనకల్ వైసిపి నాయకుడు కరణం భీమిరెడ్డి, సర్పంచి సుశీల, ఎంపీటీసీ ఓబులేష్, సచివాలయ కన్వీనర్లు ఉమాశంకర్, ప్రసాద్, ప్రతాపరెడ్డి, గహసారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

జగన్న స్టిక్కర్లను అందిస్తున్న ఎంపీపీ పుష్పావతి భీమ్‌రెడ్డి, వైసిపి నాయకులు

In the Court of the IInd Addl. Junior Civil Judge : Ananthapuramu

O.S.No.906/2022

Between:
Canara Bank (Erstwhile Syndicate Bank) rep.by its Senior Manager, Old Town Branch, Anantapuramu Town ...Plaintiff

And

Smt. Pooja Sathyanarayana Dixit ...Defendant

NOTICE TO DEFENDANT

To,
Smt. Pooja Sathyanarayana Dixit W/o Sathyanarayana Dixit, D.No.18/2/98, Flat No.404-B, Rajahamsa Residency, Near RTC Bus Stand, Anantapuramu Town & Dist.

పై దావా నందు వాది బ్యాంకుకు రావల్సిన బాకీ మొత్తము రాబట్టుకొనుటకై ప్రతివాది అయిన మీ పైన దావా దాఖలు చేసియున్నారు. కావున ప్రతివాది అయిన మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టు నందు తేది:03-05-2023న హాజరు కావలయును. లేని యెడల మీ పరోక్షమున దావా తీర్మానించెదరని తెలుపడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది:03-05-2023.

B.NAGALINGAM, M.A., B.L.
Advocate for Plaintiff
Anantapuramu, Cell:9440759948.